ప్రజాశక్తి

మంగళవారం 13 ఆగస్టు 2024

5

పార్వతీపురం మన్యం

అంగన్వాడీ కార్యకర్తపై చర్యలకు మంత్రి ఆదేశం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

సాలూరు పట్టణంలోని రామా కాలనీకి చెందిన మూడో అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న బలగ రాధపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ గుమ్మడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. రాధపై 8 మెమోలు, షోకాజ్ నోటీసు ఇస్తున్నప్పటికీ ఆమెపై ఇప్పటికీ చర్యలు లేకపోవడంతో, బాధితులు ఆమెపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం మంత్రి స్పందించి వెంటనే సదరు మహిళపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

రాష్ట్రవ్యాప్తంగా భూమిలకు సంబంధించిన సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయని, వీటిని పరిష్కరించడానికి ఈనెల 15నుంచి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తుల స్వీకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సోమవారం పార్వతీపురంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె జెసి శోబిక, ఐటిడిఎ పిఒ సేతు మాధవన్, డిఆర్ఒ కేశవనాయుడు, ఇతర అధికారులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వివిధ వర్గాల ప్రజల నుంచి ముఖ్యంగా గిరిజనుల నుంచి అందుతున్న ఫిర్యాదులను మంత్రి తెలుసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ ఫిర్యాదులను సమర్పించేందుకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎంతో ఆశతో, విశ్వాసంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్నారని ఆమె అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారని, ఫిర్యాదును పరిష్కరిస్తే, వారు సంతోషంగా ఉంటారని, ఫిర్యాదు సమర్పించేందుకు తాను పడిన బాధలన్నీ మరచిపోతారని ఆమె అన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు మేం ఇక్కడకు వచ్చామని ఆమె సూచించారు.

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న మంత్రి సంధ్యారాణి; పక్కన జెసి, ఐటిడిఎ పిఒ

భూ సమస్యల పరిష్కారానికి కృషి

అనంతరం మంత్రి మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. కుటుంబ సమస్యలపై కూడా అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని. వాటిని స్వీకరించి అక్కడే పరిష్కారం చూపాలన్నారు. కుటుంబ సమస్యలను వీలైనంత వరకు పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలన్నారు. ఉపాధి కోరుతూ యువత ఎక్కువగా వస్తున్నారని, వీరికి ఉపాధి కల్పించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్లు కల్పిస్తామని మంత్రి తెలిపారు. గిరిజన యువతకు స్వయం ఉపాధి కోసం ట్రైకార్ రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, గిరిశిఖర గ్రామాల గర్భిణులకు డోలీ మోత లేకుండా వసతిగృహాల్లో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో జ్వరాలు, అంటువ్యాధులు ప్రభలకుండా పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నందున వాటి పరిష్కారానికి ఈనెల 15 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు ఎక్కువగా రెవిన్యూశాఖకు సంబంధించి భూసమస్యలు పరిష్కారం కోరుతూ అర్జీలు సమర్పించారు. ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని సామాజిక అంశాలపై అర్జీలు అందజేసారు. పాఠశాల అభివద్ధి కమిటీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని పలు గ్రామాల నుంచి ఫిర్యాదులు అందాయి. మొత్తం 220 అర్జీలు ప్రజల నుంచి అందాయి. కార్యక్రమంలో అన్నిశాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి : ఎస్‌పి

స్థానిక జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని జిల్లా ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, తల్లిదండ్రులు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు స్వేచ్ఛగా విన్నవించుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ బిఎండి ప్రసాద్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు 25 వినతులు

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు 25 వినతులు వచ్చాయి. ఎపిఒ చిన్నబాబు ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వీటిలో భూ సమస్యలు పరిష్కరించాలని, పట్టాలు ఇప్పించాలని పలువురు గిరిజనులు కోరారు. అదే విధంగా తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, తాగునీటి సదుపాయం కల్పించాలని పలువురు కోరారు. ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఇఇ ఎస్.సింహాచలం, పిహెచ్ఒ గణేష్, డిఇ ఢిల్లీశ్వరరావు, సిడిపిఒ రంగలక్ష్మి, ఐటిడిఎ స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

టీచర్ల సర్దుబాటు కౌన్సిలింగ్ బహిష్కరణ

ఎంఇఒ కార్యాలయాల వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో అసంబద్ధాలను సరిచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల వనరుల కేంద్రాల (కౌన్సిలింగ్ సెంటర్లు) వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. జీవో 117తో కాకుండా జీవో నంబరు 53 ప్రకారం సర్దుబాటు చేయాలని, అసంబద్ధాలను సవరించాలని కోరుతూ కౌన్సెలింగ్‌ను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించి ఎంఇఒలకు వినతులు అందజేశారు. పాఠశాల విద్యాశాఖ సోమవారం నిర్వహించిన పని సర్దుబాటు ప్రక్రియను జిఒ 117, 128 ప్రకారం చేపట్టారు. ఈ ప్రక్రియ ఉపాధ్యాయులకు, విద్యారంగానికి నష్టాన్ని కల్గించేదిగా ఉందని పేర్కొంటూ ఉపాధ్యాయ సంఘాలు కౌన్సిలింగ్ బహిష్కరణకు పిలుపునిచ్చాయి. పార్వతీపురం ఎంఇఒ కార్యాయం వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జీవో తీసుకువచ్చి విద్యావ్యవస్థను నాశనం చేసిందని. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే జీవో అమలుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బాలకృష్ణ మాట్లాడుతూ గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే జీవో రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే ఆ హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. పిఆర్‌టియు నాయకులు రామినాయుడు మాట్లాడుతూ అవసరం మేరకు పని సర్దుబాటు చేయాలి తప్ప మొత్తం ఉపాధ్యాయులను కదపరాదన్నారు. అనంతరం ఎంఇఒకు వినతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో అన్ని సంఘాల ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

వీరఘట్టం: పని సర్దుబాటు ప్రక్రియను నిలిపివేయాలని కోరుతూ సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఫ్యాప్టో జాక్టో నాయకులు బహిష్కరణ కార్యక్రమం చేపట్టారు. జీవో నెంబర్ 117, 128 రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎం.పైడిరాజ్, కె.గోవిందరావు, పిఆర్‌టియు నాయకులు కె. విజయ్ కుమార్, బి బాబురావు, ఎపిటిఎఫ్ నాయకులు ఎం. మురళీ, ఆర్ ధనుంజయ నాయుడు, దుర్గాప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పని సర్దుబాటులో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా, మండల ప్రధాన కార్యదర్శులు ఎం పైడిరాజు, గోవిందరావు ఎంఇఒలు ఆర్.ఆనంద రావు, డి.గౌరీ నాయుడుకు సోమవారం వినతిని అందజేశారు. జీవో 117, 128 ద్వారా కాకుండా జీవో నెంబర్ 53 ప్రకారం పని సర్దుబాటు చేయాలని, పని సర్దుబాటు ప్రక్రియలో సీనియర్లకు విల్లింగ్ అవకాశం కల్పించాలని కోరారు.

అన్న క్యాంటీన్ స్థలంపై ఫిర్యాదు

ప్రజాశక్తి- సాలూరు

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ నిర్మాణానికి నిర్దేశించిన స్థలం పై వివాదం తెరపైకి వచ్చింది. ఈ స్థలంపై హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు వున్నట్లు జమిందార్ కుటుంబానికి చెందిన పిబి శ్రీనివాస్ సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో హెచ్‌డిటి భాను ప్రసాద్‌కి ఫిర్యాదు చేశారు. 2009లో సర్వే నెంబర్ 162/2లో వున్న ఇదే స్థలంలో అప్పటి విలేకరుల సంఘం నాయకులు ప్రెస్ భవనం నిర్మాణానికి సిద్ధమయ్యారని ఆ స్థలం తమదేనని జమిందార్ కుటుంబానికి చెందిన విక్రం చంద్ర సన్యాసి రాజు కేసు వేశారన్నారు. దీనిపై విలేకరుల సంఘం నాయకులు ఆర్వీ నారాయణమూర్తి కౌంటర్ దాఖలు చేయగా హైకోర్టు స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ స్థలం పై ఇప్పటికీ స్టేటస్ కో కొనసాగుతోందని పిబి శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నారు. వివాదాస్పద స్థలంలో అన్నా క్యాంటీన్ నిర్మించవద్దని ఆయన కోరారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పేదలు, గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా

ప్రజాశక్తి - మక్కువ

మండలంలో పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ మండలంలో వెంకట బైరిపురం, లోవరఖండి ఇంకా మరి కొన్ని గ్రామాల్లో పేదలు, గిరిజనులు కొండ పోరంబోకు భూమి, అటవీ భూమి గత 25 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నారన్నారు. కానీ ఇంత వరకు పట్టాలివ్వలేదని తెలిపారు. అలాగే శంబర, ఎస్.పెద్దవలసతో పాటు గిరిజన ప్రాంతంలో అనేక గ్రామాల్లో పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిని పేదలకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఈనెల 29న కలెక్టరేట్ వద్ద ధర్నా జరుగుతుందన్నారు. అనంతరం తహశీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు టి.ప్రభాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు పిట్టల సీతారాం, అల్లు ఆదినారాయణ తదితరులుపాల్గొన్నారు.

బడిదేవరకొండపై గ్రానైట్ తవ్వకాల లీజు రద్దు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం కోరి రెవెన్యూ పరిధిలోని బడిదేవరకొండపై అటవీ శాఖ అనుమతుల్లేకుండా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా గ్రానైట్ త్రవ్వకాలకు మంజూరు చేసిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసి వినతిని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడిదేవరకొండ గ్రానైట్ మైనింగ్‌కు 2016 లోనే లీజు లైసెన్స్ ఎంఎస్‌పి గ్రానైట్ కంపెనీకి ఇవ్వగా, ఆ కొండ రిజర్వు ఫారెస్ట్‌కు సంబంధించినది గనుక లీజు లైసెన్స్‌పై అటవీ శాఖ అధికారులు అప్పట్లోనే అభ్యంతరం చెప్పగా, రెవెన్యూ అటవీశాఖ ఉమ్మడి సర్వేలో ఆ భూమి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ దేనిని తేల్చడం వల్ల, స్థానిక ప్రజలు, ప్రజాసంఘాలు నిరసన పోరాటం తో గ్రానైట్ లీజు లైసెన్సు 2017లో రద్దు అయ్యిందన్నారు. అనంతరం ఎంఎస్‌పి గ్రానైట్ కంపెనీ హైకోర్టుకు వెళ్లగా, హైకోర్టు 2023న అటవీశాఖ అభ్యంతరాలను పరిగణలోకి తీసుకున్న తర్వాతే లైసెన్సు పునరుద్ధరణ చేయాలని చెప్పిందని , కానీ మైనింగ్ శాఖ అటవీశాఖ అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకుండా ఏకపక్షంగా లైసెన్స్ పునరుద్ధరించిందని తెలిపారు. మొదట సర్వేలో అది అటవీశాఖది కాగా, ఇప్పుడు ప్రభుత్వానిదిగా ఎలా మారిందని ప్రశ్నించారు. ఇందులో ఏదో జరగరాని మతలబు జరిగిందన్నారు. బడిదేవరకొండపై లీజు లైసెన్స్ ఇచ్చే ముందు దాని వల్ల ప్రభావితమయ్యే చుట్టుపక్కల గ్రామాల ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయలేదన్నారు. ఎటువంటి సాగునీటి వనరుల్లేని పార్వతీపురం మండలంలో వాతావరణాన్ని ప్రభావితం చేసే బడిదేవర కొండేనని ప్రజల విశ్వాసం అన్నారు. ఈ కొండనే తీసేస్తే పార్వతీపురం ప్రాంతం భయంకరమైన కరువు బారిన పడుతోందని, ఆ కారణంగా బడిదేవరకొండపై తవ్వకాల లైసెన్స్ రద్దు చేయాలని పరిసర గ్రామ ప్రజలు, రైతులు కూడా డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ప్రజల విశ్వాసాలను, నమ్మకాలను, మనోభావాలను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఎంతైనా ఉందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన గ్రానైట్ తవ్వకాల లీజు లైసెన్సును రద్దు చేయాలని కోరారు. దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వం, గ్రానైట్ యజమాన్యం ముందుకు పోతే పరిసర గ్రామ ప్రాంతాల ప్రజలను కలుపుకొని ఆందోళనలో ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిని అందజేసిన వారిలో మండల సిపిఎం కార్యదర్శి బంటు దాసు పాల్గొన్నారు.

మంత్రికి సిపిఎం వినతి

జెసికి సమస్యను వివరిస్తున్న కృష్ణమూర్తి

అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్‌లో ఉద్యోగ అవకాశాలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా దీన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విద్యార్హత లేని వారికి కూడా ఇందులో అవకాశం ఉంటుందన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ మహిళలు హాజరు కావచ్చని చెప్పారు. డిగ్రీ / పీజీ లేదా డిగ్రీ (కెమిస్ట్రీ , ఆక్వా కల్చర్, మైక్రో బయాలజీ) చదువుకొని, 19 నుండి 25 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ యువకులు హాజరుకావచ్చని చెప్పారు. ఈనెల 20న ఉదయం 9 గంటల నుండి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని చెప్పారు. ఈ డ్రైవ్‌లో కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం కలదని అన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు తమ వివరాలను skilluniverse.apssdc.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 6305110947, 9494777553 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చని సూచించారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సీతంపేట : మండలంలో నారాయణగూడ సమీపాన 600 లీటర్లు బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎం.జగదీష్‌నాయుడు తెలిపారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ తన సిబ్బందితో కలిసి నారాయణగూడ గ్రామ సందర్శనకు వెళ్లిన సమయంలో 600 లీటర్లు పులిసిన బెల్లం లభించిందని తెలిపారు దీన్ని స్వాధీనం చేసుకొని ధ్వంసం చేసినట్టు తెలిపారు. సారా విక్రయించినా, రవాణా చేసిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



హెచ్‌ఐవి, ఎయిడ్స్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేస్తున్న మంత్రి, అధికారులు

ఆరోగ్య కార్యక్రమాల్లో అందరి భాగస్వామ్యం

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. ఈ మేరకు నేషనల్ డీ వార్మింగ్ డే, హెచ్‌ఐవి-ఎయిడ్స్ అవగాహనకై మీకోసం కార్యక్రమాల పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవి రాకుండా, వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, హెచ్‌ఐవి వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలి, అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలపై, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడే మార్గాలపై విస్తతంగా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా యువత మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు బారిన పడకుండా ఉండాలని సూచించారు. అలాగే ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని మంత్రి సూచించారు. తద్వారా పిల్లల్లో రక్తహీనత నివారణ, పోషకాలు గ్రాహ్యత మెరుగు పడుతుందన్నారు. చేతుల పరిశుభ్రత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా అనేక రోగాలకు దూరంగా ఉండవచ్చని అన్నారు. అన్ని అంగన్వాడీ, పాఠశాలల్లో నిర్వహించబోయే డీ వార్మింగ్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శోబిత, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, ఐటిడిఎ పిఒ సేధు మాధవన్, డిఆర్ఒ కేశవ నాయుడు, డిఎంహెచ్ఒ కె.విజయపార్వతి, డిప్యూటీ డిఎంహెచ్ఒ టి.జగన్మోహన్, ఆర్బిఎస్కె ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

జిల్లాలో గల వివిధ హాస్టళ్లలోని విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, పండు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన శాఖ సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వసతి గృహ విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వీటిని ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారం కావడం లేదని తెలిపారు. గిరిజన సంక్షేమ హాస్టళ్లల్లో ఎఎన్ఎం పోస్టులు నియమించాలని, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో స్థానిక సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను నియమించాలని, సాలూరు పోస్ట్ మెట్రిక్ కాలేజ్ హాస్టల్‌కు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఇక్కడ గిరిజన ఆశ్రమం పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. పార్వతీపురంలో గల పోస్ట్ మెట్రిక్ కాలేజీ వసతిగృహంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని, పార్వతీపురం బాలుర, బాలికల కాలేజ్ హాస్టళ్లలో బోరు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సాలూరులో శిథిలా వ్యవస్థలో ఉన్న డైనింగ్ హాల్ పనులు పూర్తి చేయాలని, కురుపాం బాలికల పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనం ఏర్పాటు చేయాలని, సాలూరు మండలం చినపారన్నవలస, శివరాంపురం మధ్య వేగావతి నదిపై వంతెన పనులు పూర్తి చేయాలని, పాలకొండ పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు హెచ్.సింహాచలం, కె. డేవిడ్, ఎం. సంధ్య పాల్గొన్నారు.

బిల్లుల స్వాహాపై ఫిర్యాదు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కత్తుల కవిటి సచివాలయ భవన నిర్మాణ పనుల బిల్లులను స్వాహా చేశారని అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కొత్తవలస జగదీష్ సోమవారం ఎంపిడిఒ సుబ్రహ్మణ్యంకు వినతి పత్రాన్ని అందించారు. గ్రామ సచివాలయ నిర్మాణ పనులకు సంబంధించిన బిల్లులు పరిశీలించాలని, పనులు పూర్తికాకుండానే బిల్లులు స్వాహా చేశారంటూ ఆరోపించారు.

అధికారుల డుమ్మా

మండల పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఎంపిడిఒ ఎంవిబి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు అధికారులు డుమ్మా కొట్టారు. ఈ పరిష్కార వేదికకు ఐసిడిఎస్ సూపర్‌వైజర్, ట్రాన్స్‌కో లైన్‌మేన్, ఉపాధి ఎపిఒ మినహా మిగిలిన శాఖలకు సంబంధించిన అధికారులు ఎవరూ హాజరు కాలేదు. తమ సమస్యలను అధికారులకు చెప్పుకుందా మనుకుంటే అధికారులు హాజరు కాకపోవడంతో తమ గోడును ఎవరికి వినిపించుకోవాలంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

పట్టాయిగెడ్డ సమీపాన సంచరిస్తున్న ఏనుగుల గుంపు

పట్టాయిగెడ్డలో ఏనుగుల హల్‌చల్

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జరడ గ్రామపంచాయతీ పరిధిలో గల పట్టాయిగూడ గిరి శిఖర గ్రామంలో సోమవారం ఏనుగుల గుంపు చొరబడి అలజడి సృష్టించాయి. దీంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఇంతవరకు పోడుపంటలను నాశనం చేస్తున్న ఏనుగులు ఒక్కసారిగా గ్రామంలోకి చొరబడడంతో భయాందోళనకు గురై ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఉంటున్నామన్నారు. కావున అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి తమ గ్రామాలకు దూరంగా ఏనుగుల గుంపు తరలించి తమ ప్రాణాలకు, పంటలకు రక్షణ కల్పించాలని కోరారు.

రైతు పంటలకు భరోసా కల్పించాలి

కొమరాడ : మండలంలో తిష్ట వేసిన ఏనుగులు గుంపును అడవి ప్రాంతానికి తరలించి ఏనుగులను సంరక్షించి రైతుల పంటలకు భరోసా కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ మన్యం జిల్లాకు ఒరిస్సా, శ్రీకాకుళం నుంచి వచ్చిన ఏనుగుల్లో 8 చనిపోవడం బాధాకరమన్నారు. మరో 11 ఏనుగులు జిల్లాలోనే తిరుగుతున్నాయన్నారు. ఏనుగుల వల్ల కూడా 11 మంది చనిపోయారని రూ.6 కోట్ల వరకు పంట నష్టం, ఆస్తి నష్టం జరిగిందని గుర్తు చేశారు. ఏనుగుల భారి నుండి రైతులను పంటలను రక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివుని నాయుడు, గిరిజన యువకులు పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఎస్. ఉషారాణి సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారతదేశం, జాతీయ పతాకం ఆవశ్యకతను వివరించారు. మదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లలిత, రామమోహనరావు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షం కల్పించండి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని వివిధ గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని, అలాగే తోటపల్లి ఆధునికీకరణ పనులు మంజూరు చేయాలని ఆయకట్టుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2018లో ఇచ్చిన జీవో పునరుద్ధరించి నిధులు మంజూరు చేసి రైతులకు మేలు చేయాలని మండల టిడిపి నాయకులు గిరిజన సంక్షేమశాఖామంత్రి సంధ్యారాణికి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరికి సోమవారం వినతి పత్రం అందజేశారు. అలాగే జంఝావతి ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు వచ్చేలా లిఫ్ట్ చేసి సిరివాడ, మండలంలోని వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. వినతిని అందజేసిన వారిలో మండల టిడిపి అధ్యక్షులు అక్కేన మధుసూదనరావు, కండేనా బలరాం నాయుడు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దుమ్మంగి ఉత్పత్తి కేంద్రానికి 40 లక్షల చేప పిల్లలు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మండలంలోని దుమ్మంగి చేపల ఉత్పత్తి కేంద్రంలో సోమవారం కట్లా, రాగండి, యెర్రమైల వివిధ జాతుల ఇండియన్ మేజర్ కార్ప్స్ చెందిన 40లక్షలు చిరుచేప పిల్లలను (స్పాన్) పెంపకానికి విడుదల చేసినట్లు మత్స్య శాఖ అభివృద్ధి అధికారి డబ్బీరు గోపికృష్ణ తెలిపారు. 50 లేదా 60 రోజులు పెంపకం అనంతరం 10లక్షలు ఫింగర్లింగ్స్ చేప పిల్లలను కల్చర్ చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు లైసెన్సెడ్ రిజర్వాయర్లు, ట్రైబల్ ఫిషర్స్‌కు అక్టోబర్ నెలలో ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ట్రైబల్ ఫిషర్ సొసైటి అధ్యక్షులు సుదర్శన్, రాష్ట్ర ఎస్‌టి ఉపాధ్యక్షులు బొప్పడ అప్పన్న దొర, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ వెంగళరాయుడు, సురేష్, స్థానిక ట్రైబల్ మత్స్యకారులు, సీడ్ఫాం కేర్ టేకర్ హరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి కేంద్రంలో చేపలను వదులుతున్న అధికారులు

తహశీల్దార్ సోమేశ్వరరావు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

స్థానిక తహశీల్దార్‌గా సోమేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాలకొండ ఎఒగా పనిచేసిన ఈయన ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ఇతర జిల్లాకు వెళ్లి బదిలీపై తిరిగి వచ్చారు. జిల్లా కలెక్టర్ ఆయనకు పార్వతీపురం తహశీల్దారుగా బాధ్యతలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు చేపట్టిన ఈయనకు వీఆర్వోల సంఘం అధ్యక్షులు పురుషోత్తం తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

నంద పంచాయతీలో బీరమాసిని చేర్చాలి

ప్రజాశక్తి - మక్కువ

బీరమాసి షెడ్యూల్ గ్రామాన్ని పక్కనే ఉన్న నంద పంచాయతీలో చేర్చాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేసింది. గతంలో నంద పంచాయతీ నుంచి వేరుచేసి 20 సంవత్సరాల క్రితం శంబర పంచాయతీలో చేర్చారని సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న శంబర పంచాయతీలో చేర్చడం అన్యాయమని చెప్పారు. ఈ గ్రామం షెడ్యూల్ గ్రామం అయినప్పటికీ ఇప్పటికి కూడా మంచినీటి సదుపాయం లేదని ఊటల ద్వారా వచ్చే నీటిని ఒడిసి పట్టుకొని తాగుతున్నారని ఆవేదన వక్తం చేశారు. రోడ్డు సదుపాయం లేకపోవడం జ్వరాలు వచ్చినా, జబ్బు చేసిన, గర్భిణస్త్రలను హాస్పిటల్‌కు తీసుకువెళ్లాలన్నా డోలీలు కట్టి మోసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులు దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లినా ఫలితం లేదని చెప్పారు. ఈ ప్రభుత్వమైనా చర్యలు చేపట్టాలని రైతు కూలీ సంఘం నాయకులు మత్యాలు, పీడికి అసరి డిమాండ్ చేశారు.

పిఒ బదిలీ నిలిపివేయాలి

ప్రజాశక్తి -సీతంపేట

ఇటీవల బదిలీ అయిన సీతంపేట ఐటిడిఎ పిఒ టి.రాహుల్ కుమార్‌రెడ్డి బదిలీని నిలిపివేయాలని ఆదివాసీలు గిరిజన సంక్షేమశాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణికి కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆమె తన ప్రయత్నం తాను చేస్తానన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు బి.రామ్మోహన్‌రావు, మండంగి విశ్వనాథం, మోహన్ బాబు చిరంజీవిలు తదితరులు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సలకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

ఇటీవల గ్రామాల్లో నిర్వహించిన కంటి వైద్య శిబిరాల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం (కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి ఉచితంగా శస్త్ర చికిత్సలు కోసం సోమవారం కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి అనీల్ నీరుకొండ కంటి ఆసుపత్రి (తగరపువలస) తరలించినట్లు మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్లజోళ్లు, మందుల సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. శస్త్ర చికిత్సలకు వెళ్తున్న రోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు మాలిక, ఆషా కార్య కర్తలు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని పెదమరికి పంచాయతీ కొత్త ఊరుకు చెందిన మెల్లిక గణేష్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని కలిసి వినతిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితుడికి ఐటిడిఎ తరఫున అన్ని రకాలుగా ఆదుకోవాలని, దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పాలక రంజిత్ కుమార్, తాడంగి సాయిబాబు, పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఇంటికుప్పల రామకృష్ణ, ఉర్లక నాగార్జున, ఆరిక ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి- కురుపాం

మహిళలు వృత్తి శిక్షణ కార్యక్రమాలు నేర్చుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కెవికె గృహ విజ్ఞాన శాస్త్రవేత్త వై.ఉమాజ్యోతి అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏడు రోజులుగా మహిళా రైతులకు అటవీ ఉత్పత్తులకు విలువ జోడింపు, బిస్కెట్లు, కేకు తయారీ తదితర అంశాలపై ఏడు రోజుల నైపుణ్య శిక్షణ ముగింపు కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ శిక్షణలో నేర్చుకొనే అంశాలు జీవితం ఆరోగ్యంగా జీవించడానికి కాక ఆర్థిక సామర్థ్యాన్ని పెంచుకునే, ఉపాధి అవకాశాలు కూడా ప్రణాళిక చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు

ప్రజాశక్తి- గరుగుబిల్లి

గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఇంఛార్జ్ తహశీల్దార్ పెళ్లూరి సత్యలక్ష్మి కుమార్ తెలిపారు. సోమవారం గ్రామ రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సదస్సులపై సమావేశం నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కారానికి సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించాలన్నారు. గ్రామ సభలు నిర్వహించిన సమయంలో రైతులు భూములకు సంబంధించి వినతులు స్వీకరించాలన్నారు. ఈ మేరకు రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామసభలు నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేయనున్నామన్నారు. ఈ సమావేశంలో మండల రెవెన్యూ పరిశీలకులు మండంగి కృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు తాతా రవికుమార్, మాదలింగి ధనంజయరావు, తట్టికోట శ్రీనివాసరావు, ఉద్దవోలు కరుణా కరరావు, మండంగి గౌరీశంకర్రావు, రెడ్డి వినాయకుడు, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని స్త్రీ శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థలు, ఇతర ప్రాంతాల్లో ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. యువత డ్రగ్స్ వైపు వెళ్లడని, సమాజంలో రోల్ మోడల్‌గా ఉండాలని ఆమె కోరారు. 'నాకు వంద మంది యువత ఉంటే దేశాన్ని మార్చగలను' అనే స్వామి వివేకానంద సూక్తిని పునరుద్ఘాటిస్తూ యువత స్ఫూర్తిగా నిలవాలని కోరారు. యువత డ్రగ్స్‌కు లోనుకావద్దని, ప్రమాదకర ప్రభావాల పట్ల అవగాహన పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెసి ఎస్ ఎస్ శోభిక, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి ఎస్.సేదు మాధవన్, డిఆర్ఒ జి.కేశవ నాయుడు, వికలాంగుల సంక్షేమ సహాయ సంచాలకులు కె.కవిత, డ్వామా ప్రాజెక్టు అధికారి కె.రామచంద్రరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

సీతానగరం : మండల పరిషత్ కార్యాలయం నుంచి బజార్ వరకు నషాముక్తా భారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కె.ఈశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిపి, బి.రమణమ్మ, శ్రీరాములు నాయుడు, ఎపిఎం ఆర్.శ్రీరాములు నాయుడు, సిసిలు, అంగన్వాడీ సూపర్వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: నషా ముక్త భారత్ అభియాన్‌లో భద్రగిరి నిర్వహించారు. బిఐలో ప్రిన్సిపాల్ సిహెచ్ సునీల్‌కుమార్, సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు విద్యార్థులతో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా సంరక్షణ కార్యదర్శి అల్లక లక్ష్మీ, వెటర్నరీ అసిస్టెంట్ రూప్సీ, ఎటిఒ తిరుమల, సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం :యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రతి గ్రామంలో మహిళా సంఘాల సభ్యులు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ ఎస్.అప్పారావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎపిఎం ఐవి కిషోర్ ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన నషా ముక్త భారత్ అభియాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిసిలు, విఒఎలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ : చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు అన్నారు. మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలపై ప్రభావం చూపకుండా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కిట్‌ను అందిస్తున్న ఎస్‌ఐ

యువత క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి - కొమరాడ

యువత క్రీడల్లో రాణిస్తూ మంచి మార్గాల్లో నడవాలని ఎస్‌ఐ నీలకంఠం అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో యువకులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుతోపాటు క్రీడల్లో రాణించి గ్రామానికి మండలానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. యువత తమ కుటుంబం పట్ల బాధ్యతగా ఉంటూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌ఐ నాయుడు, రైటర్ రాజారత్నం, సిబ్బంది, గిరిజన యువకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలే కీలకం

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధంగా చేసుకోవాలని ఎంపిడిఒ కె.ఈశ్వరరావు ఉన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి గ్రామ స్వరూపం తయారు చేసుకోవాలన్నారు. గ్రామాల ఆర్థిక వ్యయాలు ఉండగా ప్రతి గ్రామపంచాయతీ వారి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరామనాయుడు, జెడ్‌పిటిసి ఎం.బాబ్జీ, ఎఒ ఎల్‌ఎంఎల్‌వి ప్రసాద్, వివిధ గ్రామాల సర్పంచులు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : శిక్షణను వినియోగించుకోవాలని డిప్యూటీ సిఇఒ వెంకట్రామన్ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక వైటీసీలో సర్పంచులు, కార్యదర్శులకు లైటింగ్ పారిశుధ్యం అందేలా సర్పంచులు, బాధ్యతల విధులపై ఈ నెల 12 నుంచి 14 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్త నుంచి సంపద నిర్వహణ ఏర్పాట్లు గురించి తెలిపారు. విధులు, బాధ్యతలు గురించి అవగాహన కల్పించారు. శిక్షణా కార్యక్రమంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ రాజు, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు తయారీ విజయవంతంగా పూర్తి కావాలంటే అందరి భాగస్వామ్యం అవసరమని ఎంపిడిఒ పైల సూర్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పారిశుధ్యం, జిపిడిపి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పంచాయతీల్లో ఎల్ఇడి లైట్లు నిర్వహణ, తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, ఎఒ నాలి అర్జునరావు, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, ఎపిఒ మండల గౌరీనాథ్, పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మక్కువ: మాట్లాడుతున్న జెడ్‌పిటిసి శ్రీనివాసరావు

గరుగుబిల్లి: మండల కేంద్రమైన గరుగుబిల్లిలో నషా విముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఐసిడిఎస్, ఉపాధి హామీ పథకం, తదితర శాఖల అధికారులచే ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పైల సూర్యనారాయణ, ఎఒ నాలి అర్జునరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి, ఎపిఒ మండల గౌరీనాథ్, పలువురు అంగన్‌వాడీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలో నషా విముక్త భారత్ అభియాన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీరఘట్టంలోనే ఎంఎంఎస్ ఆధ్వర్యంలో మహిళా సమైక్య కార్యాలయం నుండి ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. నడిమికెళ్ల పాఠశాలలో కూడా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎస్కే ఫక్రుద్దీన్, ఎంఎంఎస్ అధ్యక్షులు పి.సుజాత, ఎపిఎం బి.శివున్నాయుడు, ఎఫ్ఇఒ సిసి వై ఆనందు, సిసిలు, విఒఎలు, సమైక్య సిబ్బంది, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కొమరాడ : గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే గ్రామంలో ఉన్న ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శుల మూడు రోజులు జరగనున్న శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామంలోని పారిశుధ్యం, వీధిలైట్లు, సోల్డ్ వేస్టేజ్ మేనేజ్మెంట్ తదితర అంశాలపై సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకొని గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంపిడిఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 31 గ్రామ పంచాయతీలకు సంబంధించి సర్పంచులు పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ద్వారపురెడ్డి లక్ష్మి, మండల కార్యాలయ ఎఒ రమేష్, పంచాయతీ విస్తరణ అధికారి రాధాకృష్ణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీవోలు సరే.. నిధులేవి.?

మక్కువ: రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి ఆయా పంచాయతీలకు పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేస్తున్నట్లు జీవోలు ఇచ్చింది తప్ప నిధులు ఎప్పుడు మంజూరు చేస్తారని జెడ్‌పిటిసి మావుడి శ్రీనివాసరావు ప్రశ్నించారు. సోమవారం సర్పంచులు కార్యదర్శులతో మూడు రోజులపాటు జరిగే శిక్షణలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించడం శుభ పరిణామం అని అన్నారు. గత ప్రభుత్వాలు రూ.100, రూ.250 స్వాతంత్ర దినోత్సవాలకు ఇవ్వడాన్ని తప్పు పట్టిన ఆయన పంచాయతీలను బట్టి రూ.10వేలు, రూ. 25వేలు ఇవ్వనున్నట్లు జీవో ఇచ్చారు గాని ఇంకా నిధులు మంజూరు చేయలేదని గుర్తు చేశారు. ఎంపిడి దేవకుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని సర్పంచులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని పంచాయతీల సర్పంచులు కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంపేట: మాట్లాడుతున్న డిప్యూటీ సిఇఒ వెంకటరామన్

గుమ్మలక్ష్మీపురం: పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, నిధుల వినియోగంపై సర్పంచులు, కార్యదర్శులు అవగాహన పెంచుకొని గ్రామాల అభివృద్ధికి మరింత తోడ్పడాలని ఎంపిపి కె.దీనమయ్య కోరారు. పంచాయితీల్లో పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పంచాయతీల్లో ఎల్ఇడి లైట్లు నిర్వహణ తదితర అంశాలపై గ్రేడ్-1 నుండి గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి సర్పంచులు, కార్యదర్శులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచుల బాధ్యతలు, విధులు గుర్తించి ప్రజా సమస్యల పరిష్కరించి ప్రతి గ్రామాన్ని అభివద్ధి పథంలో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రమేష్‌బాబు, తదితరులు ఉన్నారు.

జంఝావతి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జంఝావతి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, బార్నాల సీతారాం, బోను చంద్రమౌళి, బడే గౌరినాయుడులు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న మంత్రి గుమ్మిడి సంధ్యారాణికు వినతిపత్రాన్ని అందించారు. ఈ ప్రాజెక్టు నుండి పార్వతీపురం మున్సిపాలిటీకి మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలో ఉన్న పలు వీధులలో వీధి లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షులు వంగల దాలి నాయుడు సోమవారం ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఉన్న ఆర్‌డిఒ హేమలతను ఐటిడిఎ పిఒను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని పోలీస్ స్టేషన్ వీధి, మహంతి వీధి నుండి దేవాంగుల వీధి వరకు గల ప్రాంతంతో పాటు వై.కె.ఎం.కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, చీకటిమయం కావడంతో దొంగతనాలకు, కుక్కలు, విషపు పురుగులకు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. జిల్లా ఆస్పత్రిలో వైద్యులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆసుపత్రి నుండి రిఫరల్ కేసులు అధికంగా లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పార్వతీపురం రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలో గిరిజన విద్యారంగా సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి మురళి, ఎస్ మురళీమోహనరావు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి వినతి అందించారు. భాషా వాలంటీర్స్‌కు ఉత్తర్వులు డిప్యూటీ ఇఒ, ఎంఇఒ, ఎటీ డబ్ల్యుఒల ప్రమోషన్లు గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్లు, ఇవ్వడంతో పాటు అనర్హులకు ఇచ్చిన ప్రధానోపాధ్యాయ ప్రమోషన్లను రద్దు చేయాలని కోరారు. ఎఎన్ఎం, కుక్కు, కమాటిల నియామకం చేపట్టాలని, పాఠశాలను వసతి గృహాలను వేరువేరుగా నిర్వహించాలని కోరారు.

పూడికలు తీయాలని నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

మండల కేంద్రంలో పెద్దగెడ్డ నిర్వాసితులైన కేసలి, కోటికిపెంట పంచాయతీకి చెందిన నిర్వాసిత కాలనీలో గల కాలువల్లో పూడికలు తీయాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరుతూ మురికి కాలువ వద్ద గ్రామస్తులు సోమవారం నిరసన తెలిపారు. నిర్వాసిత సంఘం నాయకులు బి.అభిమన్యుడు, బద్నాన సురేష్, శంకు, జర్నీ, జ్ఞానేశ్, నిర్వాసితు గిరిజనులు సుంకి జర్నీ, సుంద రమ్మ, సత్యవతి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలువల్లో కూడి కలు తీయకపోవడం వల్ల డెంగీ, మలేరియా వంటి విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారన్నారు. కావున అధికారులు వెంటనే స్పందించి కాలువల్లో పూడికలు తీసి కొత్త కాలువలు నిర్మించా లని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇప్ప టికైనా ఎంపిడిఒ స్పందించి కేసలి, కోటికిపెంట నిర్వాసిత కాలనీలో నివసిస్తున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. లేకుంటే మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పూడికలను పరిశీలిస్తున్న నాయకులు

పూతికవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కురుపాం

మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేటు జె.సౌమ్యా జోస్పిన్ ఆదేశాల మేరకు సోమవారం పూతికవలస గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులతో పాటు గ్రామస్తులకు మెరుగైన వైద్యాన్ని డాక్టర్లు కె. సందీప్, పి. శుకృత అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 173 మంది పరీక్షలు జరపగా 12 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి. కుమారస్వామి, కె.అశోక్‌కుమార్లతో పాటు పారా లీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరారావు, వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని పాల్గొన్నారు.

రోగులకు తనిఖీ చేస్తున్న వైద్యులు

ఉత్తరాంధ్ర సాధన సమితి ఆధ్వర్యాన ధర్నా

సాలూరు: తరతరాలుగా వెనుకబాటుతనానికి గురవుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక రాష్ట్రం సాధించడమే ఏకైక మార్గమని ఉత్తరాంధ్ర సాధన సమితి కన్వీనర్ వేమిరెడ్డి లక్షునాయుడు చెప్పారు. సోమవారం ఆయన ఆధ్వర్యాన సమితి నాయకులు కార్యకర్తలు మండల తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధికి ఆమడ దూరంలో వుండడానికి కారణం రాయలసీమ నాయకుల పెత్తనమేనని అన్నారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చినా ఉత్తరాంధ్ర జిల్లాల వెనుకబాటుతనం పోలేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం మూడు జిల్లాల నాయకులు, ప్రజలు పోరాడాలని లక్షునాయుడు కోరారు. అనంతరం హెచ్‌డిటి భాను ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి నాయకులు రెడ్డి సత్యంనాయుడు, చుక్క సన్యాసిరావు, చుక్క కూర్మినాయుడు, రెడ్డి తవిటినాయుడు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న నాయకులు

మున్సిపాలిటీని నిర్లక్ష్యం చేశారు

టిడిపి కౌన్సిలర్ల ఫిర్యాదు

ప్రజాశక్తి- సాలూరు

గడిచిన మూడేళ్లుగా మున్సిపాలిటీ అభివృద్ధిని వైసిపి పాలకవర్గం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించారు. సోమవారం టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు ఆధ్వర్యాన కౌన్సిలర్లు, నాయకులు మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులకు గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు పత్రాన్ని అందించారు. పట్టణంలో ఒక్క అభివృద్ధి పని కూడా జరగలేదని, మురుగు కాల్వలలో చెత్త చెదారాలు నిల్వ వుండి పోవడంతో దోమల ఉత్పత్తి పెరిగిందని, తద్వారా మలేరియా, వైరల్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. వైసిపి పాలకవర్గ సభ్యులు గ్రూపు రాజకీయాలతో నిత్యం కాలక్షేపం చేస్తున్నారని, అభివృద్ధి పనులు విస్మరించారని చెప్పారు. మున్సిపాలిటీలో షాడో చైర్మన్ పెత్తనం పెరిగిందని, ఆయన అధికారులతో సమీక్షలు నిర్వహించడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొనిసి వరలక్ష్మి, వైదేహి కృష్ణారావు, టి.లక్ష్మోజీ, వైకుంఠం హర్షవర్ధన్, టిడిపి నాయకులు కొనిసి వేణుగోపాల్, అక్కేన అప్పారావు, కృష్ణ పాల్గొన్నారు.

వినతి పత్రాన్ని అందిస్తున్న కౌన్సిలర్లు

నిరసన ర్యాలీ చేస్తున్న రెల్లి కులస్తుల సంఘ నాయకులు, తదితరులు

5 శాతం రిజర్వేషన్ కల్పించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రెల్లి వాటి అనుబంధ ఉపకులాలకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ పార్వతీపురం జిల్లా కేంద్రంలో ఆ సంఘం నాయకులు ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మంత్రి గుమ్మడి సంధ్యారాణికి పరిష్కార వేదికలో వినతి సమర్పించారు. వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన నాటి నుంచి ఈనాటి వరకు రెల్లి దాని అనుబంధ ఉప కులాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని, దుర్భరమైన జీవన పరిస్థితిలలో సదరు కులాలు పారిశుధ్య పనులు కట్టలు, బుట్టలు అల్లుకుంటూ అటవీ ఉత్పత్తులైన పండ్లు కాయలు రోడ్డుమీద అమ్ముకుంటూ రోజువారి కూలీలుగా రిక్షా కార్మికులుగా దీనస్థితిని అనుభవిస్తున్నారని చెప్పారు. వారి వెనుకబాటుతనం పేదరికం ఆధారంగా ఐదు శాతం రిజర్వేషన్ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొంటి కుమార్, గండి డేనియల్, పాలకొండ మరియదాస్, రాజశేఖర్, గండి శరత్, చైతన్య, కోలా కిరణ్ పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ పాలకొండ
జూనియర్ సివిల్ జడ్జి కోర్టు
O.S. 44/2020

Between :
గర్భాన సింహాచలం నాయుడు .....వాది
And :
కోడూరు విశ్వేశ్వరరావు ....ప్రతివాది

ప్రతివాది : కోడూరు విశ్వేశ్వరరావు, S/o శంకరరావు, వ॥ 38 సం॥లు, హిందూ, కానిస్టేబుల్, నెం. 4312, నివాసం చలివేంద్రి గ్రామం, వీరఘట్టం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా.

పై నెంబరు గల దావా తే 30-08-2024దిన వాయిదా అయి ఉన్నది. ఇందు విషయమై మీకు ఆక్షేపణలు ఉన్న యెడల **తే॥ 30-08-2024దీన ఉదయం గం॥ 10-30 ని॥**లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ, ఈ కోర్టులో హాజరు అయ్యి కోర్టువారితో మనవి చేసుకోవలసినది లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమందు విచారించి తీర్మానము చేయుదురని తెలియజేయడమైనది.

పాలకొండ
తేది: 13-08-2024

ఎ.టి.వి.గోవిందరాజు
అడ్వకేట్, పాలకొండ